క్లుప్తంగా

న్యాయవిద్య ఫలితాలు సకాలంలో విడుదల చేయాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయవిద్యను చదువుతున్న విద్యార్థుల సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేయాలని బసవతారకం న్యాయకళాశాల కరస్పాండెంట్ ఎస్. గోవర్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన వైవీయూలో వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనం చేయడానికి న్యాయ కళాశాలల ఫ్యాకల్టీకి అవకాశం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ ప్రాసెసింగ్‌లో సాంకేతిక సమస్యలను సరిచేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ తదితర వాటిలో గ్రామీణ యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువకులు ఇందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఉద్యోగుల సేవలో ఎంప్లాయిస్ యూనియన్



మాట్లాడుతున్న జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో ఉద్యోగుల సేవలో ఎంప్లాయిస్ యూనియన్ కొనసాగుతున్నదని జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కేకే కుమార్, రాజశేఖర్‌లు తెలిపారు. మంగళవారం జోనల్ కార్యాలయం వద్ద 72వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, మెడికల్ సౌకర్యాలను కల్పించిన ఘనత ఎంప్లాయిస్ యూనియన్ దేనన్నారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రటరీ రామ్మూర్తి, రీజినల్ నాయకులు ఆర్‌బీఎస్ మణ్యం, హుసేన్, డిపో అధ్యక్షులు రాము గౌడ్, సెక్రటరీ బాల వెంకటేష్, కోశాధికారి శ్రీనివాసులురెడ్డి, గ్యారేజీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్రంలోని అంగన్వాడీలకు తెలంగాణ కంటే మెరుగ్గా రూ. 14,500 వేతనాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ కోరారు. కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీలు చేపట్టిన 34 గంటల నిరసన కార్యక్రమం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన గఫూర్ మాట్లాడుతూ తాను కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వమని అడగడం లేదని, తెలంగాణ కంటే మెరుగ్గా ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు అంగన్వాడీలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. రిటైర్డ్ అయిన తర్వాత పెన్షన్ ఇవ్వాల్సిందేనన్నారు. పెరిగిన ధరలను బట్టి వేతనాలు పెంచకపోతే ఎలా? అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి, కోశాధికారి అంజనీదేవి, సీఐటీయూ జిల్లా, జిల్లా, నగర ప్రధాన కార్యదర్శి మనోహర్, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’ ప్రజలకు సువర్ణావకాశం

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



47వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



9వ డివిజన్‌లో ప్రజలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఒక సువర్ణావకాశం లభించిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక 47, 33, 34ఎ వ డివిజన్లలో నిర్వహించిన ‘జగనన్న సురక్ష’ శిబిరాల్లో ఆయన పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు తదితరాలకు సంబంధించి 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్ కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, చాక్లెట్ గౌస్, బాలస్వామి రెడ్డి, షఫీ, సుభాన్‌బాషా, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా పథకాలు : మేయర్

కులమతాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మేయర్ సురేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక 9వ డివిజన్ ఎన్‌జీవో కాలనీలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరానికి ఆయన హాజరై అర్హులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్, రేషన్‌కార్డు, ఇంటి స్థలం ఏది కావాలన్నా జన్మభూమి కమిటీలకు ఎంతో కొంత చెల్లిస్తే తప్పా వచ్చేవి కావన్నారు. ప్రస్తుతం ఎలాంటి సిఫారసులు లేకుండా పారదర్శకంగా పథకాలు ఇంటి వద్దకే వెళ్లి అందించడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, 9వ డివిజన్ ఇన్‌చార్జి మల్లికార్జున కిరణ్, కార్పొరేటర్ కె. సూర్యనారాయణరావు, డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అక్షయ్, వాసు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సద్వినియోగం చేసుకోవాలి

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 20వ డివిజన్ కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఏపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో వారు ప్రజలకు వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ షరీఫ్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని తెలుగు గంగ, గాలేరు–నగరి ప్రాజెక్టులకు రాష్ట్ర బడ్జెట్‌లో తగినన్ని నిధులను కేటాయించాలన్నారు. నిధులు లేక పోవడం వల్ల ఈ ప్రాజెక్టుల పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయన్నారు. గాలేరు–నగరి అంతర్భాగం అయిన వామికొండ, సర్వరాయ సాగర్ ప్రాజెక్టులు పూర్తయినా పంట కాల్వలు లేక రైతుల భూములకు సాగు నీరు అందడం లేదన్నారు. జిల్లాలో కేసీ కెనాల్ ప్రాజెక్టు కింద 90 వేల ఎకరాల ఆయకట్టు ఉందని చివరి ఆయకట్టు వరకు నీరు అందలేదన్నారు. కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీరు అందాలంటే రాజోలి జలాశయం, గుండ్రేవుల, జలదరాశి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: నిబంధనలు పాటించని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చాలా ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు నిబంధనలను పాటించడం లేదన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ఫైనాన్స్ కంపెనీలను తనిఖీ చేసి అక్రమార్కులను కట్టడి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక విభాగం నాయకులు అశోక్ రావు పాల్గొన్నారు.

క్రీస్తు సన్నిధిలో శాంతి, సమాధానం లభిస్తుంది



కల్వరి ప్రార్థనా మందిరాన్ని ప్రారంభిస్తున్న దైవ సేవకులు మైఖేల్‌బాబు

కడప రూరల్: ప్రభువైన ఏసుక్రీస్తు దైవ చింతనతోనే శాంతి, సమాధానం చేకూరుతుందని దైవ సేవకులు మైఖేల్ విజయ్‌కుమార్ (మైఖేల్ బాబు) తెలిపారు. మంగళవారం కడప నగర శివార్లలోని వెంకట్రాంపల్లెలో కల్వరి ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు నీడలో పయనించిన వారికి ఎలాంటి సమస్యలు, ఆపదలు ఎదురు కావన్నారు. ఆ మహోన్నీయుని మార్గం అనుసరణీయమన్నారు. మారుమూల ప్రాంతంలో చర్చిని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో చర్చి వ్యవస్థాపకులు రెవరెండ్ పి.జోయల్ విజయ్‌పాల్, సంఘ కాపరి పాస్టర్ ఆదిమూలం రమేష్, కార్యదర్శి బ్రదర్ లియో, దైవ భక్తులు పాల్గొన్నారు.

అధిక జనాభాతో దుష్పరిణామాలు

– ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ



వైవీయూ: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ



కడప ఎడ్యుకేషన్: విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్

వైవీయూ: అధికంగా జనాభా పెరుగుదలతో ప్రపంచమానవాళికి దుష్పరిణామాలు తప్పవని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సుబ్బలక్షుమ్మ పేర్కొన్నారు. మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన కలిగే అనర్థాలను వివరించారు. జనాభా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. జి. విజయలక్ష్మి, డా. పి. శచీదేవి, డా. గురవారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్/ కడప స్పోర్ట్స్: జనాభా నియంత్రణ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ సురేష్‌రెడ్డి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్‌లు సూచించారు. మంగళవారం కడప చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్లో ప్రపంజ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ రైటింగ్ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవానికి ఏదో ఒక థీమ్ ఉంటుందన్నారు. ఈ ఏడాది లింగసమానత్వం–మహిళలకు గల అవకాశాలన్న థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అవగాహన కల్పించేందుకు బాలికల పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సోఫియా, పీఈటీ విజయలక్ష్మి, స్టెప్ మేనేజర్ సుబ్బారాయుడు, సిబ్బంది సుబ్బారావు, అబ్బాస్‌అలీ, నాగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులలో వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ సమస్యను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఈఓ పూల్‌లో ఉన్న ఎల్‌పిలకు కూడా జీతాలు ఆలస్యం అవుతున్నాయన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలుగా మారిన పాఠశాలలకు డీడీఓ కోడ్ లేని కారణంగా వారి జీతాలు ఆలస్యమవుతున్నాయన్నారు. సంబంధిత సమస్యలను పరిష్కరించి సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు డీఈఓను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అమ్మద్, నాయకులు క ఇరణకుమార్, జావిద్, సిద్దయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు మంగళవారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహ రించిన వారిపై జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హెచ్చరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం కింద ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో నూతన పరిశ్రమల స్థాపనకు లేదా వున్న పరిశ్రమల అభివృద్ధికి ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్‌పీ మధు తెలిపారు. ఈ పథకం కింద ప్రాజెక్ట్ వ్యయంలో 90 శాతం రుణ సౌకర్యం వుంటుందన్నారు. 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు వల్లూరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వుంటామని, ఆసక్తి వున్న వారు తమ దరఖాస్తులను అందించవచ్చునని డీఆర్‌పీ తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథం (వెలుగు) కార్యాలయంలో జరిగిన నిధుల దుర్వినియోగానికి సంబంధించి మంగళవారం థర్డ్ పార్టీ విచారణ ప్రారంభమైంది. కార్యాలయంలో సీఐఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి, ఇసుక రీచ్ కమీషన్ల నిధులకు సంబంధించి మొత్తం రూ.53.79 లక్షల మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెలుగు చూసిన నేపథ్యంలో కలెక్టర్ థర్డ్ పార్టీ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం ఆధ్వర్యంలో మంగళవారం వల్లూరులోని వెలుగు కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయా విభాగాల లావాదేవీల రికార్డులను పరిశీలించారు. కార్యాలయ సిబ్బంది, సంబంధిత గ్రామ సమాఖ్యల వీఓఏలతో పలు అంశాలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ సత్యానందం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. నిధుల దుర్వినియోగం జరిగిన 7 సమాఖ్యల రికార్డులను పరిశీలించి పూర్తి స్థాయి నివేదికలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ సీనియర్ అసిస్టెంట్ మురళీ, ఏపీఎం శైలజ, వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ టీచర్ పోస్టుల సృష్టి హర్షణీయం

కడప ఎడ్యుకేషన్: ప్రతి స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ పోస్టు సృష్టి హర్షణీయం అని ఏపీ సీఆర్‌పీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీలోని క్లస్టర్ రీసోర్సు పర్సన్‌లను క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్‌గా పేరు మార్చుటకు కృషి చేసిన ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చెన్నూరుకు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : చెన్నూరులో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమానికి కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి రానున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారని వారు తెలిపారు. కాగా ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అలాగే గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్టిఫికెట్లు పొందే లబ్ధిదారులు పాల్గొనాలని వారు తెలియజేశారు.

నేడు లేబాకలో ..

వల్లూరు: మండల పరిధిలోని లేబాక గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తామని ఆమె తెలిపారు.

మాస్టర్ ప్లాన్ ఆధారంగా విస్తరణ పనులు చేపట్టాలి



దేవుని కడప రోడ్డులో విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: మాస్టర్ ప్లాన్ ఆధారంగా విస్తరణ పనులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. మంగళవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ప్రకాష్ నగర్ మెయిన్ రోడ్డు, అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ రోడ్డు, దేవునికడప రోడ్డు, మాసాపేట రోడ్డు పనులను టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.
– ప్రకాష్‌నగర్‌లో విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద కల్వర్టు ఏర్పాటు చేయాలని, ప్రకాష్‌నగర్ రోడ్ నంబర్ వన్ నుంచి రోడ్డు, డ్రైన్, ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలన్నారు. అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలన్నారు. మాసాపేట డ్రైన్ పనులను మొదలు పెట్టాలని సూచించారు. గౌస్ నగర్ ఉర్దూ స్కూల్ ముందు ఉన్న వాటర్ ప్లాంట్లను తొలగించాలని, మార్కెట్ యార్డు నుంచి దేవునికడప వరకూ వంద అడుగుల రోడ్డు నిర్మించేలా విస్తరణ చేపట్టాలన్నారు. కేసీ కెనాల్ రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీధి దీపాలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, డీఈ కరిముల్లాఖాన్, కార్పొరేటర్ కె. బాబు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యం

– ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ



సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

దువ్వూరు : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యమని జిల్లా ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ అన్నారు. దువ్వూరులోని 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దువ్వూరు మండలంలో విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయన్నారు. వీటిని జీరో చేసేందుకు కావాల్సిన మరమ్మతులు పూర్తి చేసి వినియోగదారులకు నిరంతరం విద్యుత్ అందిస్తామని చెప్పారు. అనంతరం ఎస్ఈ దువ్వూరులోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కొందరు రైతులు ఎస్ఈని కలసి సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లను అందించాలని కోరగా.. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి త్వరలో అందిస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ జీవీ రామిరెడ్డి, డీఈఈలు శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, ఏఈ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టండి

– రాష్ట్ర ఉద్యానశాఖ సలహా మండలి చైర్మన్ శివప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న శివప్రసాద్ రెడ్డి

గోపవరం: వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టిపెట్టాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహా మండలి చైర్మన్ పుత్తా శివప్రసాద్ రెడ్డి సూచించారు. మంగళవారం బద్వేలు ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సిద్దవటం, అట్లూరు, గోపవరం, బద్వేలు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.
రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ, ఏఓ అరవిందనాయక్, సిబ్బంది సలహా మండలి చైర్మన్ శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు



కడప కల్చరల్ : కడప శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

పెరిగిన కూరగాయల ధరలు

సబ్సిడీతో టమాట కిలో రూ. 50 అందిస్తోన్న ప్రభుత్వం



కడప రైతు బజార్‌లో సబ్సిడీతో టమాటాలు విక్రయిస్తున్న వ్యాపారులు

కడప అగ్రికల్చర్: కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మొన్నటి దాకా కిలో రూ. 10 ఉన్న టమాటాల ధర ఒక్కసారిగా పెరిగింది. వీటితోపాటు పలు కూరగాయల ధరలు మండుతున్నాయి. గత నెల రోజులుగా అల్లం ధర ఎక్కువగా ఉంది. కిలో రూ.60 ఉన్న అల్లం ధర క్రమేనా పెరుగుతూ నేడు కిలో రూ. 250 చేరుకుంది. బీన్స్ కిలో రూ. 100 ధర పలుకుతోంది. అలాగే టమాటా కిలో రూ. 90, మిరపకాయ కిలో రూ. 80, కాప్సికమ్, చిక్కుడుకాయలు కిలో రూ. 70, క్యారెట్ కిలో రూ. 80, కాకరకాయలు కిలో 60, అలసందలు, బీట్రూట్‌లు కిలో రూ. 50, కాలీఫ్లవర్ కిలో రూ. 45, బీరకాయ కిలో రూ. 40, దొండకాయ, ముల్లంగి, దోసకాయలు కిలో రూ. 30 ధర పలుకుతున్నాయి. ఈ ధరలతో సామాన్య వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. అయితే ఆకుకూరల ధరలు అందుబాటులో ఉన్నాయి.

ప్రభుత్వం కల్పించుకుని...

టమాట ధర అమాంతంగా పెరగడంతో ప్రభుత్వం కల్పించుకుని సబ్సిడీతో కిలో రూ. 50 అందజేస్తోంది. మదనపల్లె, పీలేరు ప్రాంతాల నుంచి అధిక ధరతో కొనుగోలు చేసి కడపకు దిగుబడి చేసి కడప రైతు బజార్‌లో కిలో రూ. 50తో సబ్సిడీ కింద అందిస్తోంది. దీంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చింది.

ప్రశాంతంగా టమాటా పంపిణీ

కడప అగ్రికల్చర్: కడప రైతు బజార్‌లో మంగళవారం ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందించిన టమాట పంపిణీ ప్రశాంతంగా జరిగింది. ప్రతి వినియోగదారుడికి సంబంధించిన ఆధార్‌కార్డును పరిశీలించిన తరువాతే ఒకొక్కరికి కిలో చొప్పున టమాటాలను అందించారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ మేనేజర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.